క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



మద్దూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి పాఠశాల ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. శుక్రవారం మండలంలోని నందిపాడ్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీఓ రామన్నతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. తప్పని సరిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని వారికి సూచించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఆర్థిక భరోసా నింపేందుకు సీఎం సహాయ నిధి ద్వారా చెక్కుల పంపిణీ చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన పుష్పలత, వెంకటమ్మ, ముత్యాలుకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, భానునాయక్, ఏఎంసీ డైరెక్టర్ వెంకటయ్య, నాయకులు రాస్నం బాల్‌రాజ్, వెంకటయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీ

మరికల్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మసూద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో తరచుగా చోరీ జరుగుతుండటంతో అనుమానాస్పద వాహనాలు తనిఖీ చేస్తున్నామని, డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, మితిమీరిన డ్రైవింగ్ ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు.

వజ్రోత్సవాలకు తరలిన రైతులు



మరికల్: హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన వజ్రోత్సవాల వేడుకలకు మరికల్ వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో మండలం నుంచి రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి పరశురామ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగే రైతు సదస్సు వజ్రోత్సవాల సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు నూతన వంగడాలు, అధిక దిగుబడి ఎలా సాధించాలనే అంశాలపై అవగాహన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆగ్రో రైతు సేవ కేంద్రం నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీను, సాయిరామ్, అనంత్‌రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

మక్తల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ గోవిందురాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడి ఉన్నాయని, వాటిని పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కర్రెమ్ కృష్ణ, అధ్యక్షుడు సయ్యద్ జాకీర్, మూర్తి, వెంకటగిరి, మారెప్ప, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

దామరగిద్ద: మల్లికార్జున స్వామి నూతన ఆలయ నిర్మాణానికి భీష్మ ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కందెన్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలన నిర్మాణాన్ని ఆయన సందర్శించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాపన్‌పల్లిలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి ఫౌండేషన్ తరపున సహాయం చేశామన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. భవిష్యత్‌లో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, లాలప్ప, కిష్టప్ప, నరేందర్, భీంశప్ప, ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, బాలాజీ, గోపాల్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్, శివరాజ్, శ్రీనివాస్, నర్సింహ, సంతోష్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనార్థాలతో పాటు పోటీ పరీక్షలు, నాయకత్వ లక్షణాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ కోసం బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. కాలేజీల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వల్ల విద్యార్థులు భయంతో సూసైడ్ చేసుకునే అవకాశాలుంటాయని, అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ కు పాల్పడితే పేట షీ టీం సెల్ నంబర్ 8712670398 పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు ఆటలు ఆడాలని తెలిపారు. పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ పోలీసులు, లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని చట్టాల గురించి తెలుసుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని శాసన్‌పల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ చూసుకోవాలన్నారు. అనంతరం వరకట్న నిషేధం చట్టం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. సమస్యల పరిష్కారానికి 15100 కు ఫోన్ చేయాలని, తప్పకుండా పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్, పంచాయతీ కార్యదర్శి భాను ప్రకాష్, ఏఎస్‌ఐ ఆంజనేయులు, పార లీగల్ వలంటీర్ సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

మక్తల్: మక్తల్ పట్టణంలో పద్మావతి కాలనీల్లో విద్యుత్ సమస్య ఉందని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శంషొద్దీన్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి కాలనీల్లో శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కరెంటు మంజూరు చేసి దాదాపు 10 స్తంభాలు, వాటికి సరిపడ వైరు, మిగతా సామగ్రి అమర్చి పనులు చేయించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కారం చేయించారని తెలిపారు. ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



మక్తల్ పద్మావతి కాలనీలో కరెంటు స్తంభాల పనులు ప్రారంభించిన శంషొద్దీన్

కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



మద్దూరులో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

సాక్షి నెట్‌వర్క్: పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించినందున దళిత సంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మహమ్మద్ అలీ, ప్రవీణ్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

■ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేలన చేస్తు మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశాడు. దామరగిద్ద మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజిలయ్యగౌడ్, గోపాల్, అంబేడ్కర్ సంఘం సభ్యులు ఆనంద్, వెంకటప్ప, హన్మంతు, అభిలాష్, లు పాల్గొన్నారు.

పోయిన డబ్బులు దొరికాయి

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన రైతు తిమ్మన గురువారం నారాయణపేట మార్కెట్ యార్డులో కందులు అమ్మగా రూ. 50 వేలు వచ్చాయి. వాటిని తీసుకొని గ్రామానికి వెళ్తూ మరికల్ చౌరస్తాలో బొలెరా వాహనం దిగాడు. అక్కడ జేబులో నుంచి డబ్బులు కిందపడిపోయాయి. ఇంటికి వెళ్లి జేబులో చూసుకుంటే డబ్బులు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా కిందపడ్డ డబ్బులను తీసుకున్న వ్యక్తిని గుర్తించిన పోలీసులు వెంటనే అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి రికవరీ చేశారు. శుక్రవారం బాధిత రైతుకు సీఐ రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా డబ్బులు అందించడంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాము, కృష్ణారెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.



బాధిత రైతుకు పోయిన డబ్బులు ఇస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

మోకాళ్లపై కూర్చొని వినూత్న నిరసన

నారాయణపేట రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వివేకానంద మున్సిపల్ పార్క్ దగ్గర చేస్తున్న ధర్నా 9వ రోజుకు చేరింది. శుక్రవారం రాష్ట్ర బాషోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు యశ్వంత్, లక్ష్మీకాంత్, సత్యనారాయణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నర్సింహులు, అసిస్టెంట్ జిల్లా యువజన క్రీడా అధికారి సాయినాథ్, తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు రత్నయ్య, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, శ్రీధర్, ఆంజనేయులు, అనంత్ సేన, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయికుమార్‌లు మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లగౌడ్, అల్తాఫ్, రవికుమార్, నారాయణ పవర్, ఆరీఫ్ అహ్మద్, గౌరమ్మ, విజయ, శాలిని, రాజ్యలక్ష్మి, అశ్విని, వెంకటరెడ్డి, కృష్ణకుమార్, నవీన్, అనిత పాల్గొన్నారు.



మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మక్తల్‌లో క్రీడలు ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి

మక్తల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని మక్తల్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మక్తల్‌లో సీఎం కప్ సైక్లింగ్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మక్తల్‌లో స్పోర్ట్స్ అథారిటీ జిల్లా సైక్లింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారు మహేశ్వరంలో ఈనెల 27 నుంచి 29 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం క్రీడాకారులకు టీషర్టులు, హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్, మక్తల్ తహసీల్దార్ సతీష్ కుమార్, డీవైఎస్‌ఓ వెంకటేష్, కమిషనర్ భోగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, విష్ణువర్ధన్, నరేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీటీపీ, టీజీఆర్‌ఎస్‌ఏ కార్యవర్గం

నారాయణపేట: నూతన టీజీటీఏ, టీజీఆర్‌ఎస్‌ఏ కమిటీ జిల్లా కార్యవర్గం సభ్యులు శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్, జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ బిన్‌షాలంను మార్యదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. కార్యక్రమంలో టీజీటీఏ ప్రసిడెంట్ జమీల్, ట్రెజరర్ బి.మల్లికార్జున రావు, టీజీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షులు రవి, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌లతో పాటు సభ్యులు ఉన్నారు.

వరి కొయ్యలతో సేంద్రియ ఎరువు

ధన్వాడ: వరి కొయ్యలు సేంద్రియ ఎరువుగా వాడుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని రైతులు వరికోసిన తరువాత వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కలియదున్నుకోవాలని, వరి కొయ్యలు కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని, దిగుబడి 5 నుంచి 10శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. రసాయన ఎరువుల అవసరం, వాయు కాలుష్యం తగ్గుతుందని రైతులకు విజ్ఞప్తి శారు.

నిరంతరం కరెంట్ సరఫరా చేయాలి

మరికల్: యాసంగిలో వరినాట్లు వేసుకునేందుకు నిరంతరం కరెంట్ సరఫరా చేయాలని ఎలిగండ్ల మాజీ ఉపసర్పంచ్ మోహన్, నాయకులు ప్రకాష్‌శెట్టిలు అన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ యాసంగి వరినాట్లు వేసేముందు కరిగేట్లు చేయడం కోసం పగటి సమయంలో సరఫరా చేసే విద్యుత్ సరిపోవడం లేదన్నారు. ఎమ్మెల్యే, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తే వరినాట్లు వేసుకునే అవకాశం ఉందన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం

మరికల్: తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన మరికల్ తహసీల్దార్ జమీల్‌ను శుక్రవారం కార్యాలయంలో మీసేవ యజమానులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో తహసీల్దార్ జమీల్ ఇలాంటి బాధ్యతలతో పాటు అధికారికంగా కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, శ్రావణ్, చరణ్, రమేష్, శ్రీనివాసులు, రామేశ్వర్‌రెడ్డి, హన్మంతు, శిరీష, రవి, విష్ణు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

మక్తల్: యాదవులు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర యాదవులు కార్యవర్గ సభ్యుడు రఘువీర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మక్తల్‌లో యాదవులకు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అనంతరం యాదవ మండల సభ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు చిన్నయ్య, బాలప్ప, నాగేష్, రాజేష్‌యాదవ్, వెంకటేష్, చెన్నకేశవులు, నాగులు పాల్గొన్నారు.

యాదవ సంఘం మండల కమిటీ

మాగనూర్: యాదవ సంఘం మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడు గొల్ల నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గొల్ల నారాయణ, కోశాధికారిగా కోల్వూర్ మహేష్ లతో పాటు మరో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గొల్ల వెంకటయ్య తెలిపారు. నూతనంగా ఎన్నికైన యాదవ సంఘం సభ్యులను జిల్లా గౌరవ అధ్యక్షుడు అభినందించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రియ సంఘం నూతన కమిటీ

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశంలో వీరభద్రియ సంఘం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర నాయకులు భీమేష్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా భీమేష్, ఉపాధ్యక్షుడు శివరాజు, ప్రధాన కార్యదర్శి గోపి, కోశాధికారి బాలరాజు, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, రాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆకాశ అద్భుతాలను ఆస్వాదిద్దాం



శీతాకాలం ఆయనంతముపై అవగాహన కల్పిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు మల్లేశం

కోస్గి రూరల్: అరుదుగా సంభవించే ఆసక్తికర అకాశ వింతలను ఆస్వాదిస్తూ విషయ పరిజ్ఞానం విస్తృత పరచుకోవాలని సైన్స్ ఉపాధ్యాయులు సిద్ది రాములు, మల్లేశంలు అన్నారు. మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో 'ఖగోళ అద్భుతాలు–పరిశీలన' అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ భ్రమణంలో భాగంగా సూర్యుడు, భూమి మధ్య దూరం ఏడాదిలో ఒకసారి పెరగడం, తగ్గడం జరుగుతుందన్నారు. వేసవిలో సూర్యుడికి దగ్గరగాను, శీతాకాలంలో సూర్యుడికి దూరంగాను భూ భ్రమణం జరుగుతుందన్నారు. వేసవిలో పగటికాలం ఎక్కువగాను, శీతాకాలంలో రాత్రికాలం ఎక్కువగా ఉంటుందన్నారు. శనివారం ఏర్పడబోతున్న శీతాకాలం ఆయనంతములో భాగంగా సూర్యకాంతి 8 గంటలు, చంద్రకాంతి 16 గంటలు ఉంటుందన్నారు. ఈ కారణంగా వాతావరణంలో మార్పులు సంభవిస్తాయన్నారు. శీతాకాలం ఆయనంతము, భూ భ్రమణం తీరును వీడియో ప్రదర్శన ద్వారా విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మాగనూర్: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే కొనసాగుతోంది. ఎంపీడీఓ రహ్మతుద్దీన్ మాగనూర్ గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతి 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఒకరోజు కనీసం 20 లబ్ధిదారుల సర్వే చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాగనూర్ పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ధన్వాడ: మండలంలోని గోటూర్, కిష్టాపూర్‌లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ సాయి ప్రకాష్ ఆకస్మిక తనిఖీ చేశారు. సర్వేలో లబ్ధిదారుల వివరాలు సక్రమంగా పరిశీలించి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్‌లకు సూచించారు. గ్రామంలో నర్సరీ, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.



మాగనూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్ట్

నారాయణ పేట టౌన్: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఆటో యూనియన్ (టీయూసీఐ) కార్యదర్శి బి.నర్సింహ, సాదిక్, నారాయణ రెడ్డి, జమీరుద్దీన్, ఎల్లప్పలను పోలీసులు ముందస్తు గా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమిస్తామన్నారు.

మాగనూర్: ఉచిత బస్సు ప్రయాణం పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా శుక్రవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టిన ఆటో డ్రైవర్లను మాగనూర్‌లో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల సంఘం మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ..ఆ టోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని మాటిచ్చి అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో యూనియన్ నాయకులు

మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న జపాన్ వాసి



అమ్మవారిని దర్శించుకున్న జపాన్ భక్తురాలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శక్తిపీఠం మహాలక్ష్మి అమ్మవారిని శుక్రవారం జపాన్ భక్తురాలు దర్శనం చేసుకున్నారు. శక్తిపీఠం ఆవరణలోని అన్ని దేవాలయాలను, అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం, సురభి గోశాల, శారద కల్యాణ మండపంను దర్శించుకున్నారు. వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవ కార్యక్రమాలకు తాను ఎంతగానో ఆకర్షితురాలైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శక్తిపీఠం ట్రస్ట్ సభ్యులను, శక్తి పీఠం అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం కమిటీ సభ్యులను అభినందించారు. శక్తిపీఠం స్వామిజీ శాంతనంద్ పురోహిత్ ఆశీస్సులందుకున్నారు. మహాగణపతి బ్రహ్మోత్సవాలు, అమ్మవారి బ్రహ్మోత్సవాలు, శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవం, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా చూసి ఆకర్షితురాలై శక్తిపీఠం స్వామిజీ వారికి భక్తురాలిగా మారినట్లు తెలిపారు. జపాన్‌లో శక్తిపీఠం ఆశ్రమం ఏర్పాటుకు అనుమతిస్తే ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభిస్తామని స్వామిజీ వారిని జపాన్ భక్తురాలు కోరింది. కార్యక్రమంలో శక్తిపీఠం ట్రస్టు సభ్యులు యాదగిరి నారాయణరెడ్డి, రుద్ర సముద్రం రాములు, మురళీ, అన్నపూర్ణ నిత్యన్నదానం కన్వీనర్ దోమ సుధాకర్ తదితరులు ఉన్నారు.

పడమటి ఆంజనేయస్వామికి పూజలు

మక్తల్: పడమటి ఆంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ తరపున శాలువాతో ఆయనను సన్మానించారు. ఆయన వెంట రంతగ్పాండురెడ్డి, రఘురామయ్యగౌడ్, మఠంమయుర్నాథ్, భాస్కర్, కొకుంట్ల ఆంజనేయులు, రాంమాదవ్, మంజునాథ్, పూల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. భగవంత్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారి కలశ ఊరేగింపు, అష్టోత్తరం, పంచామృతాభిషేకం, మహాపడిపూజ నిర్వహించారు. అయ్యప్పలు పాడిన భజన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. సూర్యలక్ష్మీ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్స్‌పాల్ రజితసింహారెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు తాళ్ళ నర్సింహులు, కతలప్ప, వెంకటరాములు, బాలచందర్, తిమ్మిరెడ్డి పాల్గొన్నారు.



పెద్దపొర్ల గ్రామంలో అయ్యప్ప కలశ శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో కాంట్రాక్ట్ పనులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామ శివారు ఎర్రగుట్ల ప్రాంతంలో ఉన్న వ్యవసాయ గిడ్డంగి ఆవరణలో సీసీ మరమత్తు పనులు చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ చేపట్టిన పనులను కాన్‌కుర్తి గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌ను ఉపయోగించుకోని పనులు చేపడుతున్నారు. ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీ పనులకు కాకుండా కాంట్రాక్టు పనులను ఉపయోగించడం ఏమిటని స్థానిక నాయకుడు భీంరెడ్డి వాపోయాడు. గ్రామ పంచాయతీ అధికారులు ట్రాక్టర్, ట్యాంకర్‌లను దుర్వినియోగం చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

